జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక



చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761



epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

ఆదివారం | 02-3-2025 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 263 పేజీలు: 4 వెల : రూ.7


**✳ గ్యాస్ డోర్ డెలివరీ పేరిట అధిక చార్జీలు వసూళ్లు ✳ రూ.50 నుంచి రూ.100 వరకూ లాగేస్తున్న గ్యాస్ బాయ్స్ ✳ ఇదేంటని ప్రశ్నిస్తే గ్యాస్ వేయమంటున్న సిబ్బంది ✳ తమకు సంబంధం లేదంటున్న పలు ఏజెన్సీలు ✳ పొందూరులో కలెక్టర్ గ్యాస్ లబ్ధిదారులతో ముఖాముఖి ✳ అధిక చార్జీ వసూలు చేస్తే ఏజెన్సీ రద్దు చేస్తానని కలెక్టర్ ఆగ్రహం ✳ డోర్ డెలివరీ చార్జీలపై నివేదిక ఇవ్వాలని డీఎస్‌వోకు ఆదేశం**

# డెలివర్రీ



**శ్రీకాకుళం, మార్చి 1 (వార్త):** గ్యాస్ డోర్ డెలివరీ పేరిట కొందరు గ్యాస్ బాయ్స్ అధికంగా చార్జీలు వసూలు చేస్తున్నారు. దూరాన్ని బట్టి ధర అటూఇటుగా రూ.50 నుంచి రూ.100లు వరకూ గ్యాస్ కార్డుదారుల నుంచి ముక్కుపిండి దండుకుంటున్నారు. ఎవరైనా ఇదేంటని ప్రశ్నిస్తే.. రేపటి నుంచి గొడౌన్‌కు వెళ్లి తెచ్చుకోండి.. మేం వేయం అని చెప్పేస్తుండడంతో తప్పనిసరి పరిస్థితుల్లో అదనపు వడ్డనను ఇవ్వాల్సివస్తోందని కార్డుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధులు మాత్రం అదనపు వడ్డన చేయడం లేదని, కొందరు బాయ్స్ చేస్తూ ఉంటారని, దీనికి తామెలా బాధ్యత వహిస్తామని చెబుతున్నారు. బాయ్స్ మాత్రం తమకు అరకొర జీతాలు ఇస్తున్నారని, ఎక్స్‌ట్రా చార్జీలు మీరే వసూలు చేసుకోవాలని ఏజెన్సీ ప్రతినిధులు చెబుతుండడంతోనే తాము అదనపు వసూలు చేస్తున్నామని పేర్కొంటున్నారు. గ్యాస్ సిలిండర్ బిల్లు రూ.829కు బదులుగా రూ. 870 నుంచి రూ.900 వరకు వసూలు చేస్తున్నారు. దీనిపై కొందరు మీకోసంలో అర్జీలు కూడా పెట్టారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ శనివారం పొందూరు మండల కేంద్రంలో ఇంటింటికీ వెళ్లి పింఛను, గ్యాస్ తదితర అంశాలపై మహిళలతో ముఖాముఖి మాట్లాడారు. దీంతో కొందరు మహిళలు గ్యాస్ సిలిండర్ డోర్ డెలివరీ చేసే సమయంలో అదనపు వడ్డనపై కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో కలెక్టర్ ఒక్కసారిగా ఏజెన్సీ ప్రతినిధులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే డీఎస్‌వోకు ఫోన్ చేసి డోర్ డెలివరీ చార్జీలపై తక్షణం నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ఎవరైనా అధికంగా వసూలు చేస్తే చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో గ్యాస్ డోర్ డెలివరీ అదనపు వసూళ్లు ఎప్పటి నుంచో ఉంది. ఈవిషయమై సంబంధిత శాఖాధికారుల దృష్టికి కొందరు తీసుకువెళ్లినా పట్టించుకున్న దాఖలాలు లేవు. ఏకంగా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పర్యటిస్తే ఈవిషయం బహిర్గతమైంది.

## గ్యాస్ డెలివరీ చార్జీలు అధికంగా వసూలు చేస్తే చర్యలు

**✳ అటువంటి ఏజెన్సీలను రద్దు చేయండి ✳ డీఎస్‌వోకు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశం ✳ పొందూరులో గ్యాస్ లబ్ధిదారులతో కలెక్టర్ ముఖాముఖి**

**పొందూరు:** కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ శనివారం పొందూరు మండల కేంద్రంలో పర్యటించారు. పలువురి ఇళ్లకు వెళ్లి మహిళలను గ్యాస్ వినియోగిస్తున్నారా.. సిలిండర్ ధర ఎంతో మీకు తెలుసా అని అడిగారు. దీనికి పలువురు మహిళలు మాట్లాడుతూ గ్యాస్ సిలిండర్ డెలివరీ చార్జీల కింద రూ.50అదనంగా తీసుకుంటున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. రసీదులు ఇస్తున్నారా అని కలెక్టర్ ప్రశ్నించగా, ఇవ్వడం లేదని, ఫోన్‌కు మెసేజ్ వస్తుందన్నారు. గ్యాస్ సిలిండర్ డెలివరీ చార్జీలు అదనంగా వసూళ్లు చేస్తున్న ఏజన్సీలపై చర్యలు తీసుకోవాలని, అవసరమైతే ఏజన్సీని రద్దుచేయాలంటూ కలెక్టర్ డీఎస్‌వో జి.సూర్యప్రకాశ్‌ను ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా గ్యాస్ సిలిండర్ డెలివరీ చార్జీలపై విచారణ చేపట్టి నివేదిక ఇవ్వాలన్నారు.



మరికొందరు ఇళ్లకు వెళ్లి సామాజిక పింఛన్లు అందుతున్నది లేదని కలెక్టర్ ఆరా తీశారు. పెన్షన్ల పంపిణీ పరిశీలనలో 9 మందికి సకాలంలో అందడం లేదని గుర్తించి, వెంటనే వారికి ఫోన్లు చేసి అందజేయాలని సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. సాఫ్టువేర్ రంగంలో ఉన్నవారికి నైపుణ్యాలపై శిక్షణ ఇచేందుకు ప్రభుత్వం సర్వే చేపడుతుందని దీనిని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ అన్నారు. మండల కేంద్రంలో ఇంటినుంచి సాఫ్టువేర్ ఉద్యోగం చేయాలనుకోనేవారి జాబితాలను సర్వేను ఆయన పరిశీలించారు. ఇటువంటివారిని గుర్తించి నైపుణ్యాల శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు మండలంలో 403మంది నిరుద్యోగ యువతీ, యువకులను గుర్తించామని ఎంపీడీవో మన్మధరావు కలెక్టర్‌కు తెలిపారు. మండల కేంద్రంలో నిర్మాణం చేపట్టిన పలు రహదారులను ఈ సందర్భంగా పరిశీలించారు. రహదార్ల నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాలు పాటించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. నాణ్యతా ప్రమాణాలు పాటించకపోతే అధికారులే బాధ్యులు అవుతారని హెచ్చరించారు. రహదార్లు నిర్మాణాలు చేపట్టే చోట అధికారులు పర్యవేక్షణ లేకపోవడాన్ని గమనించి పంచాయతీరాజ్ డీఈ చంద్రశేఖర్‌ను కలెక్టర్ ప్రశ్నించారు. తప్పనిసరిగా అధికార్ల పర్యవేక్షణలోనే రహదార్లు పనులు చేపట్టాలని ఆయనకు ఆదేశించారు. నిర్మాణాలపై క్వాలిటీ కంట్రోల్ అధికారులు నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ఆయన వెంట డీఈ చంద్రశేఖర్, ఎంపీడీవో మన్మధరావు, ఈవో మోహన్ బాబు ఉన్నారు



## టీపీవో ఉమాను సన్మానించిన మిత్ర బృందం



**శ్రీకాకుళం, మార్చి 1(వార్త):** శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్‌లో టీపీవోగా పనిచేసిన వై.ఉమామహేశ్వరరావు శుక్రవారం రిటైర్ అయిన నేపథ్యంలో స్థానిక ప్రైవేటు ఫంక్షన్ హాల్ లో ఉమామహేశ్వరరావు దంపతులను ఆయన మిత్ర బృందం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు విభూతి సూరిబాబు మాట్లాడుతూ శేష జీవితం ఆరోగ్యంగా గడపాలని కోరారు. చదువుకున్న రోజులను గుర్తు చేసుకున్నారు. మిత్ర బృందంలో డాక్టర్ రవి కుమార్, వూన్న నాగరాజు, రామా,భాష, కోటేశ్వరరావు, బోజు కుమార్, వైకుంఠ రావు తదితరులున్నారు.

# జిల్లా పోలీసు శిక్షణ కేంద్రాన్ని తనిఖీ చేసిన ఎస్పీ



**శ్రీకాకుళం, మార్చి 1(వార్త):** తండేవలసలో ఉన్న జిల్లా పోలీసు శిక్షణా కేంద్రాన్ని ఎస్పీ కెవి మహేశ్వర రెడ్డి శనివారం సందర్శించారు. జిల్లా పోలీస్ శిక్షణ కేంద్రంలో ట్రైన్ పోలీస్ కానిస్టేబుల్ రానున్న రోజుల్లో శిక్షణ పొందేందుకు శిక్షణ కేంద్రంలో మైదానం, మౌలిక వసతులు పూర్తిస్థాయిలో సిద్ధం చేయాలనీ అధికారులను ఆదేశించారు. శిక్షణా కేంద్రంలో మైదానాన్ని, తరగతి గదులు,బ్యారెక్స్, మంచి నీటి సరఫరా, భోజనం,స్నానపు గదులు ఇతర మౌలిక సదుపాయాలు, వసతులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. శిక్షణ నిమిత్తము అవసరమగు వస్తుసామగ్రి, మౌలిక సదుపాయాలు వివరాలను, ఎటువంటి మరమ్మతులు ఉన్న యెడల తక్షణమే ప్రతిపాదనలు జిల్లా పోలీస్ కార్యాలయానికి నివేదిక రూపంలో పంపించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సిబ్బంది వివ రాలపై ఆరా తీసి శిక్షణ కేద్రంలో తరగతి గదులను, భోజనం గదులను, బ్యారక్ లను, స్నానపు గదులను పరిశీలించి అదనంగా చేయవలసిన ఏర్పాట్లు గురించి అధికారులకు పలు సూచనలు చేశారు. శిక్షణ కేంద్రంలో పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఆదనపు ఎస్పీ కెవి రమణ, సీఐ కృష్ణమూర్తి, ఆర్ఐ నర్శింగరావు, పోలీస్ హౌసింగ్ ఏఈ తరుణ్, ఎస్సై రవికుమార్ తదిత రులు పాల్గొన్నారు.



## చిరుధాన్యాల ఉత్పత్తిని ప్రోత్సహించండి

**మందస, మార్చి 1(వార్త):** గ్రామీణ ప్రాంతంలో ఏర్పడిన రైతు ఉత్పత్తిదారుల సంఘాలలో మహిళా రైతులంతా ప్రకృతి వ్యవసాయంతో పాటు చిరుధాన్యాల ఉత్పత్తిని ఎక్కువగా ప్రోత్సహించాలని వెలుగు ఐటిడిఏ అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు సూచించారు. మండల స్థాయిలో ఏర్పాటు చేసిన ఎఫ్.పి.ఓ.(ఫార్మర్ ప్రొడ్యూసర్స్ ఆర్గనైజేషన్) బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ మీటింగులో పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం గిరిజన రైతులను ప్రోత్సహించడానికి ఏర్పాటు చేసిన వన్ ధన్ వికాస కేంద్రాలకు రైతులు పండించిన పంట అంతటినీ ప్రాసెసింగ్ నిమిత్తం అప్పగించాలని తెలిపారు. జీడి పంటను కొండలోగాం వీ.డి.వీ.కే. ద్వారా మండలంలో గల రైతులంతా ప్రాసెస్ చేసుకోవచ్చని తెలిపారు. ప్రజల ఆరోగ్య అవసరాల దృష్ట్యా ఎరువులు క్రిమిసంహారక మందులు వాడకుండా నేల ఆరోగ్యాన్ని కాపాడుతూ వర్మీ కంపోస్ట్, పశువుల ఎరువు, పెంట గత్తము తో కూరగాయలు తదితర పంటలను ప్రోత్సహించాలన్నారు. చిరు ధాన్యాలైన రాగులు, జొన్నలు, సామలు, ఉదలు, కొర్రలు, సజ్జలు తదితర మన తాతల నాటి పురాతన వ్యవసాయ పద్ధతిలో దేశవాళీ ఆవు మూత్రంతో తయారుచేసిన కషాయాలను ఉపయోగించి చీడ పీడలు లేకుండా అధిక దిగుబడులను కూడా సాధించవచ్చు అని తెలిపారు. కార్యక్రమంలో ఎఫ్.పి.ఓ. సి.సి. తారక మోహన్, అకౌంటెంట్ కళ్యాణి, క్లస్టర్ కోఆర్డినేటర్లు, వి.వో.ఏ.లు రైతు ఉత్పత్తిదారు సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# అభివృద్ధి లేదు.. సంక్షేమమూ లేదు!

**- ఇదీ 2025-26 బడ్జెట్ స్వరూపం**

**-ఆమదాలవలస నియోజకవర్గ ఇన్‌చార్జి**

**చింతాడ రవికుమార్**



**ఆమదాలవలస, మార్చి 1(వార్త):** కూటమి ప్రభుత్వం నిన్న ప్రవేశపెట్టిన బడ్జెట్లో అభివృద్ధి లేదు, సంక్షేమం లేదు కేవలం అమరావతి అభివృద్దే లక్ష్యంగా చంద్రబాబు బడ్జెట్ ఉందని ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ అన్నారు. శనివారం ఆమదాలవలసలోని తన కార్యాలయంలో విలేఖరులతో ఆయన మాట్లాడుతూ మొదటి సంవత్సరం సూపర్ సిక్స్ ను అటకెక్కించిన చంద్రబాబు, రెండో సంవత్సరం కూడా సూపర్ సిక్స్ లోని ఆడబిడ్డనిధి, నిరుద్యోగ భృతి, ఉచిత బస్సు హామీలను అటకెక్కించి, అమలు చేస్తామన్న తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకాలకు సగం సగం. నిధులను మాత్రమే కేటాయించిందనిన్నారు. 50 సంవత్సరాలకే మహిళలకే పెన్షన్ ఇస్తానన్న చంద్రబాబు ఇప్పుడు ఆ పథకాన్ని ఎగ్గొంటింది పోగా, ఇప్పటికే తొలగించిన1లక్ష 20 వేల పెన్షన్లతో పాటు మరో 10 లక్షల సామాజిక పెన్షన్లు తొలగింపునకు బడ్జెట్లో కేటాయింపులు తగ్గించారని ఇదంతా పేదవారి పొట్ట కొట్టడమేనన్నారు. దీపం పథకానికి తూట్లు పొడిచే విధంగా బడ్జెట్లో తక్కువ మొత్తం కేటాయించి, ఉద్యోగుల కోసం నిధుల ప్రస్తావన ే బడ్జెట్లో లేవన్నారు. చంద్ర బాబు 2025-2026కు గాను 1లక్షా 4 వేల కోట్లు అప్పులు చేస్తామని బడ్జెట్ లో పెట్టారని, ఇలా అప్పుచేసిన మొత్తాన్ని రాష్ట్రంలో ఎటువంటి అభివృద్ధి, ఉపాధి, సంక్షేమం కోసం ఉపయోగించకుండా తన రియల్ ఎస్టేట్ అభివృద్ధికోసం అమరావతిలో పెడుతున్నారన్నారు. అమరావతికోసం 48 వేల కోట్లు టెండర్లు పిలిచారని, దీని బట్టి చంద్రబాబు రాష్ట్రాన్ని గాలికి వదిలి, ఒక్క అమరావతి మీదనే దృష్టి పెట్టి తన సంపద అభివృద్ది చేసుకుంటున్నారన్నారు.

## బడ్జెట్ అన్ని వర్గాలకు ఆమోదయోగ్యం

**-టీడీపీ మందస మండల అధ్యక్షుడు భావన దుర్యోధన**



**మందస, మార్చి 1(వార్త):** బడ్జెట్ అన్ని వర్గాలకు ఆమోదయోగ్యంగా ఉందని కాళింగ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్, టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు భావన దుర్యోధన అన్నారు. మందస మండలం హరిపురం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ 2025-2026 ఆర్థిక సంవత్సరానికి కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో ప్రవేశపెట్టిన పూర్తిస్థాయి బడ్జెట్ అన్ని వర్గాలకు ఆమోదయోగ్యంగా ఉందన్నారు. రాష్ట్రం ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ రూ.3,22,350 కోట్లతో ప్రభుత్వం బడ్జెట్లో కేటాయింపులు చేసి నవ్యాంధ్ర నిర్మాణానికి పేదరికం లేని ఆంధ్రప్రదేశ్ పునర్నిర్మాణానికి బాటలు వేసిందని తెలిపారు. సంక్షేమం అభివృద్ధి సూపర్ సిక్స్ హామీల అమలుకు సమాన ప్రాధాన్యం కల్పించారని అన్నారు. పేద మధ్య తరగతి ప్రజలకు బిసి, ఎస్సీ,ఎస్టీ మైనార్టీలకు మహిళా, రైతు కొనుగోలు శక్తి పెంపొందించేలా రూపొందించారని అన్నారు. పలాస నియోజకవర్గంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి గత 8 నెలలుగా నియోజకవర్గంలో మునుపెన్నడూ లేని విధంగా పలాస శాసనసభ్యురాలు గౌతు శిరీష నియోజకవర్గ స్థాయిలో సీసీ రోడ్లు, బీటీ రోడ్లు అలాగే కాశీబుగ్గ రైల్వే ఓవర్ బ్రిడ్జికి కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు సహకారంతో రైల్వే మంత్రి గారి దృష్టికి తీసుకుని వెళ్లి రూ.47కోట్లు గ్రాంట్ తీసుకువచ్చి పలాస కాశీబుగ్గ ప్రజల చిరకాల వాంఛ తీరబోయే రోజు అతి దగ్గరలోనే ఉందని తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్, లోకేష్ బాబు, కింజరాపు అచ్చన్నాయుడు, కింజరాపు రామ్మోహన్ నాయుడు, పలాస శాసనసభ్యురాలు గౌతు శిరీష, గౌతు శ్యామ సుందర శివాజీలకు కృతజ్ఞతలు తెలిపారు.

# జిల్లా స్థాయి సైన్స్ పోటీల్లో అరసాడ విద్యార్థుల జయకేతనం



**వంగర, మార్చి 1(వార్త):** జాతీయ సైన్స్ దినోత్స వం సందర్భంగా జిల్లా స్థాయిలో నిర్వహించిన క్విజ్ పోటీల్లో సీనియర్, జూనియర్ రెండు విభాగాల్లోనూ వంగర మండలం అరసాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠ శాలకు చెందిన విద్యార్థులు ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. సీనియర్ విభాగంలో మద్దెల. మోక్ష, జూనియర్ విభాగంలో ఎల్.ఇందుమతినాయుడు జిల్లా ప్రథమస్థానం సంపాదించారు. జిల్లా విద్యాశాఖ ఆధ్వ ర్యంలో విజయనగరంలోని మున్సిపల్ హైస్కూల్లో (కంటోన్మెంట్) శనివారం నిర్వహించిన జిల్లా స్థాయి క్విజ్ పోటీలకు 27 మండలాల నుంచి 63 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ క్విజ్ పోటీల్లో జిల్లాలోని ప్రథమస్థానంలో విజేతలైన అరసాడ హైస్కూల్ విద్యార్థులకు జిల్లా విద్యాశాఖ అధికారి యు.మాణిక్యం నాయుడు, సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కో-ఆర్డిన ేటర్ డాక్టర్ ఏ.రామారావు బహుమతులు ,సర్టిఫికెట్లు అందజేసి విద్యార్థులను అభినందించారు. ఈ విద్యార్థుకు గైడ్ టీచర్ గా చింతాడ. అప్పలరాజు వ్యవహరించారు.ఈ కార్యక్రమంలో విజయనగరం, బొబ్బిలి డిప్యూటీ డిఈ వోలు కె.వి రమణ, కే మోహన్ రావు లు, సమగ్ర శిక్ష సీఎంవో. ఆదినారాయణ, ఏఎమ్ఓ ప్రసాదరావు, అసిస్టెంట్ సీఎంవో రామారావు పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు.లి అరసాడ హై స్కూల్ విద్యార్థులు అభినందించిన ఎంఈఓ లు- ప్రవీణ్ కుమార్, జగదీశ్వరిలిలిలి.. జాతీయ సైన్స్ దినోత్సవ సందర్భంగా జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో శనివారం విజయనగరంలో నిర్వహించిన జిల్లాస్థాయి క్విజ్ పోటీల్లో అరసాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు సీనియర్, జూనియర్ విభాగంలో జిల్లాలోని ప్రథమ స్థానంలో విజేతలుగా నిలిచినందుకు, వంగర మండలానికి జిల్లాలో పేరు ప్రఖ్యాతలు తీసుకురావడానికి కృషిచేసిన మద్దెల. మోక్ష , ఎల్.ఇందుమతి నాయుడులను మండల విద్యాశాఖ అధికారులు పి.ప్రవీణ్‌కుమార్, కే జగదీ శ్వరి అభినందించారు. ఆ పాఠశాల సైన్స్ ఉపాధ్యా యులైన రమేష్, అప్పలరాజుతోపాటు పాఠశాల ఉపాధ్యాయులను అభినందించారు.

### పలాస ఆర్‌వోబీకి నిధులు మంజూరుపై

## బీజేపీ నాయకుల హర్షం

**పలాస, మార్చి 1(వార్త):** గత 15 సంవత్సరాలనుండి నిర్మాణానికి నోచుకోని కాశీబుగ్గ ఫ్లైఓవర్ వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేయడం పట్ల మండల బి జె పి నాయకులు హర్షం వ్యక్తం చేశారు. కాశీబుగ్గ పలాస పట్టణాలకు రాకపోకలు సాగించే ప్రజలకు, విద్యార్థులు లు నరకయాతన పడేవారు, ఇది గ్రహించిన స్థానిక శాసనసభ్యురాలు గౌతు శిరీష కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు దృష్టికి తీసుకుని వెళ్లడంతో నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం 46.64 కోట్లు నిధులు మంజూరు జీవో విడుదల చేసి రైల్వే శాఖ ఆధ్వర్యంలో నిర్మించేందుకు నిర్ణయం తీసుకోవడంపై పలాస బిజెపి నియోజకవర్గ కన్వీనర్ రామానంద్ స్వామి ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి, రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవికి హర్షధ్వానాలు తెలియజేశారు. మండల నాయకులు భూత్ అధ్యక్షులు కన్వీనర్లు మోడీ కి ధన్యవాదాలు తెలిపారు.



# ఆశ వర్కర్ల సమస్యలను పరిష్కరించండి



**కొత్తూరు, మార్చి 1(వార్త):** ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని కొత్తూరు మండల సి.ఐ.టి.యు నాయకులు శని వారం డిమాండ్ చేశారు.ఆశ వర్కర్ల సమస్యల పరిష్కారం కోరుతూ మార్చి 6న చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆశ వర్కర్స్ నాయకులు పి.జయలక్ష్మి,కె.జ్యోత్స్న, యస్.గౌరమ్మ,కె.పూర్ణిమ పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ మండలంలోని కురిగాం, మెట్టూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సుమారు 85 మంది వరకు ఆశా వర్కర్లు ఉన్నారు. వీరికి పని భారం తగ్గించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని ,రాజకీయ వేధింపులు ఆపాలని కోరారు. టిఎ, డిఎ ఇవ్వాలని, సంక్షేమ పథకాల అమలు చేయాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం కనీస వేతనం రూ.26 వేల ఇవ్వాలని కోరారు. సంక్షేమ పథకాలు అమలు చేయాలని, పెన్షన్ బెనిఫిట్స్ కల్పించాలని, ఉపాధి పనులు కల్పించాలని ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమస్యలు పరిష్కారం చేయాలను కోరుతూ మార్చి 6న చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేసేలా ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల సిఐటియు కమిటీ సభ్యులు,పలువురు ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## ఆర్ట్స్ కళాశాలలో 3న జాబ్ మేళా

**శ్రీకాకుళం, మార్చి 1(వార్త):** శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో నోడల్ రిసోర్స్ సెంటర్, జేకేసీ ఆధ్వర్యంలో ఈనెల 3న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ వై.పోలినాయుడు తెలిపారు. ఈ మేళాలో ఐసీఐసీఐ, హెచ్‌డీఎఫ్‌సీ, డెక్కన్ కెమికల్స్ మొదలగు 12 కంపెనీలు పాల్గొంటాయన్నారు. సుమారు 690 ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తాయనీ తెలిపారు. 10వ తరగతి నుంచి డిగ్రీ వరకు విద్యార్హతలు గలిగి 35 సం. వయసు గల పురుష, స్త్రీ అభ్యర్థులు అర్హులని తెలిపారు. ఎంపికైన వారికి జీతంతో పాటు, ఈఎస్ఐ, ఈపీఎఫ్, మెడి క్లెయిమ్స్, రిటెన్షన్ బోనస్, సబ్సిడైజ్డ్ ఫుడ్, వసతి మరియు రవాణా సౌకర్యాలతో కలిపి రూ.15,000 నుండి 65,000 వరకూ వేతనం లభిస్తుందన్నారు. ఆసక్తి గలవారు శ్రీకాకుళంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల, జవహర్ నాలెడ్జ్ సెంటర్ (జె.కె.సి) వద్దకు ఉదయం 9.30 గంటలకు ఆధార్ కార్డు, అర్హత సర్టిఫికెట్స్ జిరాక్స్ కాపీలతో హాజరుకావాలని జెకెసి కో ఆర్డినేటర్ వై.మణికుమార్ తెలిపారు. మరిన్ని వివరాలకు 9949094968, 9346577596 నెంబర్లలో సంప్రదించాలని ఆయన సూచించారు.



## పరిశోధనలతో విజ్ఞానం మెరుగు

**పలాస, మార్చి 1(వార్త):** పరిశోధనలతోనే విజ్ఞానాన్ని మెరుగుపరుచుకోవచ్చునని మండల విద్యా శాఖాధికారి పి శ్రీనివాసరావు అన్నారు. ఈ మేరకు పలాస శ్రీ చైతన్య స్కూల్ లో ప్రిన్సిపాల్ వై రామకృష్ణ ఆధ్వర్యంలో సైన్స్ ఎక్సిబిషన్ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎం ఇ ఓ మాట్లాడుతూ విద్యార్థులలో ఆసక్తి పెంచడం మరియు సృజనాత్మకతతో అనేక అద్భుతాలు సృష్టించ వచ్చని అన్నారు . సైన్స్ డే యొక్క ముఖ్య ఉద్దేశం విద్యార్థులకు వివరించారు . ప్రతి ఒక్క ప్రాజెక్టు కూడా అందర్నీ ఆశ్చర్యపరిచేలాగా ఉన్నాయని చూసిన ప్రతివారు తెలిపారు. సైన్స్ ప్రాజెక్ట్ లతో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా ఉత్తరాంధ్ర జోన్ ఏ.జీ.ఎం సురేష్ ,రీజినల్ ఇంచార్జ్ రామి నాయుడు కోఆర్డినేటర్ బాలరాజు ఉపాధ్యాయులను,విద్యార్థులను ప్రశంసించారు ఈ కార్యక్రమంలో డీన్ జోగారావు, సి బ్యాచ్ ఇంచార్జ్ షణ్ముఖరావు అసిస్టెంట్ డీన్ ధర్మారావు , ప్రైమరీ ఇన్చార్జ్ నీలవేణి, జయ బాబు సైన్స్ ఉపాధ్యాయులు మరియు ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.

## గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడి మృతి

**పలాస, మార్చి 1(వార్త):** మొగిలిపాడుకు సమీపంలో జాతీయ రహదారి ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద శనివారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో బల్ల పాపారావు (32) మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారము పాపారావు మందస మండలం అంబుగాం గ్రామానికి చెందిన వ్యక్తి. మృతుడు పలాస టోల్గేట్ లో కంప్యూటర్ ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్నడు. మధ్యాహ్నం భోజనం చేయడానికి పలాసపురం బంధువులు ఇంటికని బయలుదేరి వెళ్తుండగా మొగిలిపాడు



గ్రామం వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. ఘటన స్థలానికి పోలీసులు చేరుకొని క్షతగాత్రుడిని ప్రథమ చికిత్స చేపట్టి పరిస్థితి ఆందోళన కరంగా ఉండడంతో ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యం లోనే మృతి చెందాడు. బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కాశీబుగ్గ ఎస్సై ఎం చంద్రరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఎల్లమ్మ తల్లి జాతరకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి



**పలాస, మార్చి 1(వార్త):** ఎల్లమ్మ జాతరకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, పరిసరాలు పరిశుభ్రంగా చేయాలని పలాస మున్సిపల్ కమిషనర్ నడిపేనా రామారావు అన్నారు. 23వ వార్డు లో జరిగే ఎల్లమ్మ తల్లి జాతరకు కమిటీ సభ్యులు కమిషనర్‌కు ఆహ్వానం పలికారు. జాతరకు చుట్టుపక్కల మండలాల పరిధిలో గల ప్రజలు, భక్తులు యావన్మంది విచ్చేయుచున్నందున జాతర జరుగు ప్రదేశంలో మంచినీటి సరఫరా, విద్యుత్తు అలంకరణ, శానిటేషన్, ఇతర సదుపాయములు కల్పించవలసిందిగా కోరారు. దీనిపై కమిషనర్ స్పందిస్తూ పురపాలక సంఘ సిబ్బందిని, ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎల్లమ్మ తల్లి జాతర ఆహ్వాన కమిటీ సభ్యులు బుదియా సాహూ, పాపారావు, సిందిరి బాబురావు తదితరులు పాల్గొన్నారు.

## పలాసలో ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

**పలాస, మార్చి 1(వార్త):** పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో ఐదు పరీక్ష కేంద్రాల్లో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు శనివారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. పలాస ప్రభుత్వ జూనియర్ కళాశాల, సూర్య తేజ జూనియర్ కళాశాల, విద్యా వాహిని జూనియర్ కళాశాల, శ్రీ చైతన్య జూనియర్ కళాశాల, ప్రజ్ఞ జూనియర్ కళాశాలలో ఈ పరీక్షలో ఉదయం 9 గంటలకు ప్రారంభమై 12 గంటలకు ముగిశాయి. ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులు 1535 మంది పరీక్షలకు హాజరైనట్లు ఇంటర్ బోర్డు ప్రాంతీయ అధికారి దుర్గారావు తెలిపారు. ఈ పరీక్షలకు కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు పోలీస్ అమలు చేశారు విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆయా కళాశాలల నిర్వాహకులు ఏర్పాటు చేశారు.



## ప్రణాళికాబద్ధంగా పని చేస్తే పంచాయతీల అభివృద్ధి

**-జిల్లా పంచాయతీ అధికారిణి భారతిసౌజన్య**

**మందస, మార్చి 1(వార్త):** జిల్లా పంచాయతీ అధికారిణి భారతిసౌజన్య మందస పంచాయతీలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించి, నిర్వహణ.. ఉపయోగం తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పంచాయతీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ వేసవికాలం సమీపిస్తున్న దృష్ట్యా మంచినీటి కొరత లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ముందస్తు ప్రణాళికతో ప్రజలకు మంచినీరు అందేలా చూడాలన్నారు. పంచాయతీ రికార్డులను సక్రమంగా నిర్వహించాలన్నారు. మందస మేజరు పంచాయతీ కావడంతో ఎంతో సక్రమంగా పని చేసి, మంచిపేరు తీసుకురావాలని కోరారు. లోకల్ ట్రైనింగ్ సెంటర్ గా కొంకడాపుట్టి చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని ఎంపిక చేశారు.



కొంకడాపుట్టి సెంటర్ లో పంచాయతీ కార్యదర్శులు, ఈఓపీఆర్డీలకు నియోజకవర్గం స్థాయిలో శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు. ఆమెతో పాటు ఇన్చార్జి పంచాయతీరాజ్ విస్తరణాధికారి కె.జయప్రకాశ్, పంచాయతీ ఈఓ బమ్మిడి నవీన్ కుమార్, కొంకడాపుట్టి పీఎస్ సంక మనోజ్ కుమార్, సిబ్బంది కూడా ఉన్నారు.

## అబద్ధాల కుప్పగా రాష్ట్ర బడ్జెట్

**- ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్**

**వంగర, మార్చి 1(వార్త):** కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అబద్దాల కుప్పగా, చంద్రబాబు మోసాలకు ప్రతిరూపంగా ఉందని వైయస్ఆర్‌సీపీ రాష్ట్ర శాసనమండలి సభ్యులు పాలవలస విక్రాంత్ ఆక్షేపించారు. వంగర మండలం కోనంగిపాడు, గీతనాపల్లి గ్రామాల్లో శనివారం పర్యటించే విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల ముందు చంద్రబాబు చెప్పిన మాటలకు, ఇప్పుడు కేటాయింపులకు పొంతన లేకుండా బడ్జెట్ రూపొందించారని, ఇదంతా సూపర్ సిక్స్ పథకాల అమల్లో ప్రజలను మోసం చేయడంలో భాగమే అని ఆయన ఆరోపించారు. తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకాలకు అరకొర నిధులు కేటాయించడం చూశాక వాటిని కూడా సక్రమంగా అమలు చేయరన్నది స్పష్టమవుతోందని చెప్పారు. మాటలకు చేతలకు పొంతన లేదు,అభివృద్ధి, సంక్షేమాన్ని సమానంగా తీసుకెళ్తామని ప్రకటించిన కూటమి ప్రభుత్వం రెవెన్యూ వ్యయం కింద రూ.2.51 లక్షల కోట్లు కేటాయించి, మూలధన వ్యయం కింద కేవలం రూ.40 వేల కోట్లు కేటాయించింది. అంటే వారు చెప్పే మాటలకు చేసే పనులకు పొంతన లేదని అర్థమవుతుంది. 1995లో ఉమ్మడి రాష్ట్రంలో తొలిసారి సీఎం అయిన చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేసే నాటికి ప్రభుత్వం జీతాలివ్వలేని స్థితిలో ఉందని చెప్పి, అంతకు ముందు పాలించిన ఎన్టీఆర్‌ను ఘోరంగా అవమానించారు. వాస్తవానికి ఆ రోజుల్లో మిగులు బడ్జెట్ ఉంటే ప్రజలకు పచ్చి అబద్ధాలు



చెప్పారు. చంద్రబాబు సీఎం అయ్యాకే రాష్ట్రం అప్పులపాలైంది. సీనియర్ నాయకుడు అయి ఉండి కూడా బడ్జెట్ ప్రసంగంలో పయ్యావుల కేశవ్ తన మంత్రి పదవి కాపాడుకోవడానికి నారా లోకేష్‌ను, సీఎం చంద్రబాబును పొగిడే దుస్థితికి దిగజారిపోయారు. ఎన్టీఆర్ వైద్య సేవ అని పేరు మార్చి ఆరోగ్యశ్రీ పథకాన్ని పూర్తిగా నిర్వీర్యం చేశారు. ట్రస్టు మోడల్ నుంచి ఇన్సూరెన్స్ మోడల్‌కి మార్చేసి పేదలకు ఉచిత వైద్యం అందని ద్రాక్షగా మార్చేశారు. గతేడాది బడ్జెట్‌లో సూపర్ సిక్స్‌లో ఏ ఒక్క హామీని అమలు చేయకపోగా, ఈ ఏడాది బడ్జెట్లో కూడా ఫ్రీ బస్, ఆడబిడ్డ నిధి, నిరుద్యోగ భృతి వంటి పథకాలకు ఒక్క రూపాయి కూడా కేటాయించకపోగా, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకాలకు అరకొర నిధులు కేటయించి అమలు చేయడంపైనా ప్రజల్లో అనుమానాలు రేకెత్తిస్తున్నారు. 50 ఏళ్ల దాటిన బీసీలకు పింఛన్ ఇస్తామని మాట తప్పారు.అందుకే చంద్రబాబును నమ్మితే పులి నోట్లో తల పెట్టడమేనని, ఎన్నికల ముందు వైయస్ జగన్‌గారు చెప్పిన మాటలు ఇప్పుడు నిజమవుతున్నాయని శాసన మండలి సభ్యులు పాలవలస విక్రాంత్ మండిపడ్డారు. కార్యక్రమంలో వంగర ఎంపీపీ యూ. సురేష్ ముఖర్జీ, జడ్పీటీసీ ప్రతినిధి కరణం సుదర్శన్ రావు, వంగర ఎంపీటీసీ, సర్పంచ్ ప్రతినిధి కనగల పారినాయుడు,మాజీ ఏ.ఎం.సీ వైస్ చైర్మన్ వేమిరెడ్డి సూర్యనారాయణ, కోనంగిపాడు సర్పంచ్ చందక తాతబాబు, ఎంపీటీసీ బౌరోతు నూకం నాయుడు, గీతానపల్లి సర్పంచ్ నెయగాపుల శివరామకృష్ణ, విజయనగరం జిల్లా సోషల్ మీడియా ప్రెసిడెంట్ వై. వాసు నాయుడు స్థానిక నాయకులు తదితరులు ఉన్నారు.

## వాన కృష్ణచంద్‌కు ఘన సన్మానం

**శ్రీకాకుళం, మార్చి 1(వార్త):** అజాతశత్రువు, స్నేహశీలి, సమాజానికి, జిల్లా బార్ అసోసియేషన్ కు, ప్రాసెక్యూషన్ వ్యవస్థకు తనదైన శైలిలో విశేష సేవలందించిన తూర్పు కాపు ముద్దు బిడ్డ, సీనియర్ న్యాయవాది, "స్నేహ సుధ " వాన కృష్ణచంద్ మన జిల్లాలోని సుమారు 8 కోర్టులకు ఏక కాలంలోనే పబ్లిక్ ప్రాసిక్యూటర్ గా ప్రతిభావంతంగా బాధ్యతల్ని నిర్వహించి, న్యాయమూర్తులు, బార్ అసోసియేషన్, ప్రాసెక్యూషన్ వ్యవస్థ,పోలీస్ ఉన్నతాధికారుల మన్ననల్ని పొందారని పలువురు వక్తలు కొనియాడారు. జిల్లా తూర్పుకాపు న్యాయవాద మిత్రులు శుక్రవారం రాత్రి ప్రైవేట్ ఫంక్షన్ హాల్ లో ఆయనకు జరిగిన సన్మాన కార్యక్రమం సందర్భంలో' ' కృష్ణ చంద్ చేసిన సేవలు ,జిల్లా బార్ అసోసియేషన్ కే కాకుండా, మొత్తం న్యాయవాదులు, పబ్లిక్ ప్రాసీక్యూటర్ లందరికి గర్వకారణం అని వక్తలందరూ ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఏపీ,బార్ కౌన్సిల్ మెంబెర్,గేదెల వాసుదేవ రావు ముఖ్య అతిథిగా విచ్చేసిన ఈ సన్మానకార్యక్రమానికి జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షులు ,కిలారి ఈశ్వరరావు అధ్యక్షత వహించగా, ప్రారంభ ఉపన్యాసం బార్ ఎక్స్ వైస్ ప్రెసిడెంట్, మామిడి క్రాంతి చేయగా, వ్యాఖ్యాతగా, వావిలపల్లి జగన్నాథనాయుడు, వ్యవహరించగా, ప్రధాన వక్తగా జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ అధ్యక్షులు ,సీనియర్ జర్నలిస్ట్ శాసపు జోగినాయుడు మాట్లాడుతూ.. న్యాయ వ్యవస్థ



.. మీడియా రంగాల మధ్య ఉన్న అవినాభావ సంబంధాన్ని వివరించారు.. కృష్ణచందు అందరివానిగా.. అజాత శత్రువుగా పిలుచుకొనే గొప్ప వ్యక్తి అని కొనియాడారు. న్యాయవాది స్వీప్ ఎన్ జి ఓ కొమ్ము రమణ మూర్తి వందన సమర్పణ చేసారు. కార్యక్రమంలో చీఫ్ డిఫెన్సె కౌన్సిల్ కొమరాపు ఆఫిసునాయుడు, మాజీ బార్ అసోసియేషన్ అధ్యక్షులు డా. ఎన్ని సూర్యారావు, సీనియర్ న్యాయవాది, గొర్లె రామారావు, మాజీ జడ్పీటీసీ గొర్లె లక్ష్మణరావు, మాజీ పబ్లిక్ ప్రాసెక్యూటర్ ఎల్ వి రమణ, న్యాయవాదులు, సీనియర్ న్యాయవాదులు, రెడ్డి విశ్వేశ్వరరావు, కడగల రాంబాబునాయుడు. బొత్స సుదర్శనరావు,గొర్లె వెంకట నాయుడు, గొర్లె విజయ్ కుమార్నాయుడు, నడిపేన దుర్గా శ్రీనివాస్, డా.టంకాల బాలకృష్ణ, శ్రీరాం సీతారామ్, శ్రీరాం రుద్రశేఖర రావు, టంకాల లక్ష్మీ నాయుడు, గేదెల శాంతారాం, లోలుగు శ్రీనివాసరావు. వాకముల్లు రామ్మోహన్, ఎన్ని రమేష్, గేదెల వెంకటేష్, ఇప్పిలి చంద్రశేఖర రావు పాల్గొన్నారు.

## సంగమేశ్వరస్వామిని దర్శించుకున్న ఎంపీపీ



**వంగర, మార్చి 1(వార్త):** సంగాంలో వెలసిన శ్రీ సంగమేశ్వర స్వామిని శనివారం నాడు ఎంపీపీ ఉత్తరావల్లి సురేష్ ముఖర్జీ కుటుంబ సమేతంగా శివునికి ప్రీతికరమైన, ఇష్టమైన పూజలను ఆలయ ప్రధాన అర్చకులు సిద్ధాంతం గణపతి రావు జరిపించారు. ముందుగా ఎంపీపీ సురేష్ ముఖర్జీ కి సాలువ తో సత్కరించారు.

పూజలు అనంతరం శివుని ప్రసాదాలు స్వీకరించారు.

## పెన్షన్ల పంపిణీని పరిశీలించిన కమిషనర్



**పలాస, మార్చి 1(వార్త):** పలాస మున్సిపాలిటీలో పింఛన్లు పంపిణీ క్షేత్రస్థాయిలో పలాస మున్సిపల్ కమిషనర్ నడిపిన రామారావు పరిరక్షించారు. శనివారం ఒకటవ తేదీ కావడంతో పలాస మున్సిపాలిటీలోని పింఛన్లు పంపిణీ చేశారు. పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘంలో రోజువారి శానిటేషన్ శనివారం వివిధ వార్డులో పర్యటించారు. కాశీబుగ్గ 18 వ వార్డు గాయత్రి నగర్ లో రోడ్డు స్వీపింగ్ ప్రక్రియను పరిశీలించి, 4వ వార్డ్, అంబుసోలి ఏరియా అక్కుపల్లి రోడ్డు లో గార్బేజ్ లిఫ్టింగ్ ప్రక్రియను సక్రమంగా జరిగేటట్లుగా శానిటేషన్ సిబ్బందిని ఆదేశించారు. 16 వార్డు శ్రీనివాస్ నగర్ సింగ్ వీధిలో లో బాబ్ కార్ట్ తో, కాలువలను డీసిల్టేషన్ చేయించి, పురపాలక సంఘంలోని శివారు గ్రామాలైన, మరియు ముఖ్యంగా 5వ వార్డు తాళ్లభద్ర పెద్దవీధి లో శానిటేషన్ పరిస్థితిని సమీక్షించి, తక్షణం మెరుగైన శానిటేషన్ ను అందించవలసినదిగా పారిశుధ్య సిబ్బందిని ఆదేశించారు. తదనంతరం తాళ్ల భద్ర, ఉప్పరపేటలలో పర్యటించి త్రాగునీటి సరఫరాకు తీసుకోవలసిన చర్యలు గూర్చి అక్కడ ప్రజలను, సిబ్బందిని అడిగి కమిషనర్ వారు తెలుసుకున్నారు. తాళ్లబద్ర పెద్దవీధిలో పెన్షన్లు పంపిణీ కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కాశీబుగ్గ పాత బస్టాండ్ రోడ్లో గల అన్న క్యాంటీన్ ను రోజువారి ఇన్స్పెక్షన్స్ లలో భాగంగా ఈరోజు కూడా అల్పాహార ఫుడ్ సమయంలో తనిఖీ చేశారు. ఫుడ్ యొక్క నాణ్యతను, రుచిని చూసి, నాణ్యమైన మంచినీటి సరఫరా పరిస్థితిని పరిశీలించిన కమిషనర్ సంతృప్తిని వ్యక్తం చేశారు. మున్సిపల్ కార్యాలయంలో పలాస 19వ వార్డు సూదికొండ కాలనీ రెల్లి వీధిలో గల ప్రజలు తాగునీటి సమస్యపై కమిషనర్ వారికి తమ సమస్యలను విన్నవించుకొనగా, తాను ఇంజనీరింగ్ సిబ్బందితో కలసి మీ ప్రాంతానికి క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి మంచినీటి సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జ్ శానిటేషన్ ఇన్స్పెక్టర్లు ఉదయ్ పాత్రో, వెంకటేష్, సూది కొండ గ్రామానికి చెందిన ఆదిలక్ష్మి, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఆసుపత్రుల వద్ద మందుబాబుల హల్‌చల్

**శ్రీకాకుళం క్రైం, మార్చి 1 (వార్త):** శ్రీకాకుళం నగరంలోని డే అండ్‌నైట్ జంక్షన్, అంబేద్కర్ కూడలి వద్ద ఉన్న ఆసుపత్రుల వద్ద మందుబాబులు హల్‌చల్ చేస్తున్నారు. ఎస్పీ కార్యాలయం, ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో ఉన్న మద్యం షాపులు, బార్ల నుంచి మద్యం కొనుగోలు చేసి అక్కడే తాగుతూ అందరినీ పరేషాన్ చేస్తున్నారు. అంబేద్కర్ జంక్షన్ సమీపంలో ఓ బెల్టు షాపు ఉంది. అక్కడే మందుబాబులు లూజుగా మద్యం కొనుగోలు చేసి తాగుతుంటారు. ప్రైవేట్ ఆసుపత్రుల ఆవరణ వద్దే ఉంటూ రోగులు, వారి బంధువులు, ఆసుపత్రి సిబ్బందిపై బూతులు తిట్లు హంగామా సృష్టిస్తున్నారు. ఇటువంటి వారిపై పోలీసులు కొరడా ఝుళిపించాలని స్థానికులు కోరుతున్నారు.




## నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలి

**శ్రీకాకుళం, మార్చి 1(వార్త):** ప్రతి ఒక్కరూ నాయ కత్వ లక్షణాలను అలవర్చుకోవాలని టూరిజం విద్యా ర్థిని ముద్దాడ సీత శనివారం అన్నారు. స్థానిక ఆర్ట్స్ కళాశాలలో అఖిలభారతి విద్యార్థి పరిషత్ శ్రీకాకుళం శాఖ ఆధ్వర్యంలో నాయకత్వ, వ్యక్తిత్వ లక్షణాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగముగా ముద్దాడ సీత, మాట్లాడుతూ ప్రేరణాత్మక ప్రసంగాలు విద్యార్థుల అభివృద్ధి, శ్రేయస్సులో కీలక పాత్ర పోషిస్తాయని, విద్యారంగం, వ్యక్తిగత వృద్ధి, కెరీర్ సవాళ్లను అధిగమించేటప్పుడు, విద్యార్థులు తర చుగా సందేహం, భయం, అనిశ్చితి క్షణాలను ఎదు ర్కొంటారన్నారు. ఆర్ట్స్ కళాశాల ఇంచార్జ్ ప్రిన్సిపల్ పోలినాయుడు మాట్లాడుతూ ప్రేరణాత్మక ప్రసంగాలు అవసరమైనవని, మార్గదర్శకత్వం చేస్తాయని, విద్యా ర్థులు అడ్డంకులను అధిగమించడానికి, వారి లక్ష్యా లపై దృష్టి పెట్టడానికి, పూర్తి సామర్థ్యాన్ని వెలికి తీయడానికి సహాయపడతాయన్నారు. సానుకూల మన స్తత్వాన్ని పెంపొందించడం, స్థితిస్థాపకతను ప్రోత్స హించడం ఉద్దేశ్య భావాన్ని పెంపొందించడం ద్వారా, ప్రేరణాత్మక ప్రసంగాలు విద్యార్థులు తమను తాము విశ్వసించడానికి, అవకాశాలను స్వీకరించడానికి, అన్ని రంగాలలో రాణించడానికి శక్తినిస్తాయన్నారు. శ్రీకాకుళం జిల్లా కన్వీనర్ బోర గోపి మాట్లాడుతూ యువత శక్తివంతంగా ఉండాలని, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని అన్నారు. కార్యక్రమంలో జిల్ ఫౌండేషన్ సత్యసాయి, జాడ సాయి, నందు, సాత్విక్, ఉదయ్, సాయి, ఏబీవీపీ సభ్యులు పాల్గొన్నారు.





## వికలాంగునికి మూడు చక్రాల కుర్చీ వితరణ

**శ్రీకాకుళం, మార్చి 1(వార్త):** దీర్ఘకాలిక టిబితో బాధపడుతున్న నిరుపేద వికలాంగునికి మూడు చక్రాల కుర్చి వితరణ చేసిన పెదపాడుకు చెందిన బొట్టా.సాయి కుమార్ ఉదారత హర్షణీయమని జేమ్స్ వైద్యశాల ప్రముఖ వైద్యులు డాక్టర్. ప్రవీణ్ కుమార్ శనివారం అన్నారు. ఈ రోజు బాధితునికి జేమ్స్ వైద్యశాలలో చక్రాల కుర్చీని రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో అందించి మాట్లాడుతూ రాజాం మండలం కంచరానికి చెందిన ఎలుకల.అప్పలనాయుడు గత ఐదు సంవత్సరాల నుండి అధిక టిబితో బాధపడుతూ మంచానికే పరిమితయ్యారని, తన రెండు కాళ్ళు చచ్చుబడి నడవలేని పరిస్థితని, గతంలో తాపీ పని చేసుకుంటూ జీవనం కొనసాగించేవారన్నారు. భార్య చనిపోగా చూపు కోల్పోయిన తల్లి, నిస్సహాయ వృద్ధాప్య తండ్రి ఉన్నారని, ఇటువంటి కుటుంబానికి ఈ రోజు అండగా నిలిచిన పెద్దపాడుకు చెందిన బొట్టా. సాయి కుమార్ కు అభినందనాలని, రెడ్ క్రాస్ ప్రతినిధి నంది. ఉమా శంకర్ అందించిన సమాచారంతో చక్రాల కుర్చీ అందించారని వీరి కుటుంబాన్ని దాతలు సహృదయంతో సహాయమందించాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్.హేమంత్ మెడికల్ సూపరింటెండెంట్, డాక్టర్. బి. జ్యోష్న జీఎం ఆపరేషన్స్, డాక్టర్. ప్రవీణ్ కుమార్ జీఎం మార్కెటింగ్, డాక్టర్. మోహన్ రెస్పిరేటరీ మెడిసిన్, రెడ్ క్రాస్ ప్రతినిధులు నంది. ఉమాశంకర్, కొల్లు.సత్యన్నారాయణ, జి. పవన్ కుమార్, బి. జగదీశ్ , పొడుగు.చరణ్ , ఉర్లం. శివతేజ తదితరులు పాల్గొన్నారు.

## 5న ఎంఎస్ ఎంఈ రుణమేళా




**శ్రీకాకుళం, మార్చి 1(వార్త):** ఎంఎస్ ఎంఈ రుణాలకు సంబంధించి ఈ నెల 5న అంబేద్కర్ ఆడిటోరియంలో రుణమేళాను నిర్వహించనున్నట్టు యూనియన్ బ్యాంకు రీజనల్ హెడ్ ఎం వెంకట్ తిలక్ తెలిపారు. నగరంలోని వెంకటా పురంలో ఉన్న యూని యన్ బ్యాంకులో శనివా రం ఆయన విలేకరులతో మాట్లాడారు. శ్రీకాకుళం రీజియన్ పరిధిలో 59 బ్రాంచ్‌లు ఉన్నాయని శ్రీకాకుళం జిల్లాలో 43 బ్రాంచ్‌లు, పార్వతీపురం జిల్లాలో 16 బ్రాంచ్‌లు ఉన్నాయని వివరించారు. వీటి పరిధిలో రూ. ఎనిమిది వేల కోట్ల మేర బిజినెస్ నిర్వహిస్తున్నట్టు చెప్పారు. డిపాజిట్ల రూపంలో రూ. 3,200 కోట్లు, రుణాల రూపంలో రూ. 4,800 కోట్లు మేర లావాదేవీలు జరుగుతున్నాయన్నారు. తమ బ్యాంకుల ద్వారా ఎంఎస్ ఎంఈల రూపంలో గృహ, రిటైల్, విద్య, గోల్డ్, వ్యవసాయ తదితర రుణాలన్నీ అందజేస్తామని చెప్పారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దేశ వ్యాప్తంగా ఈ నెల 3 నుంచి 7 వరకు దేశంలోని అన్ని బ్రాంచ్‌ల్లో ఎంఎస్ ఎంఈ రుణమేళా నిర్వహిస్తున్నట్టు స్పష్టం చేశారు. అందులో భాగంగా ఈనెల 5న శ్రీకాకుళం నగరంలోని అంబేద్కర్ ఆడిటోరియంలో రుణమేళా నిర్వహిస్తున్నామని, దీనిని జిల్లా ప్రజలు, ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ మేళాకు ముంబాయిలోని యూనియన్ బ్యాంకు ప్రధాన కార్యాలయం నుంచి జీఎం పి. శ్రీనివాస్ హాజరవుతారన్నారు. రుణమేళాకు వచ్చి రుణాలు అవసరమైన వారికి ధ్రువపత్రాలను పరిశీలించి రుణాలు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. ఈ రుణమేళాను వినియోగించుకొని అందరూ వ్యాపారం ప్రారంభించి అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. కావున ప్రజలు పెద్ద ఎత్తున ఈ రుణమేళాలో పాల్గొని విజయవంతం చేయాలని వెంకట తిలక్ కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రీజనల్ హెడ్ పి రవి పాల్గొన్నారు.

## రవీంద్రభారతిలో ముగిసిన సైన్స్ ఎక్స్‌పో

**శ్రీకాకుళం, మార్చి 1(వార్త):** స్థానిక మండల వీధిలోగల రవీంద్రభారతి పాఠశాలలో సైన్స్ ఎక్స్పో సంబరాలు గత వారం రోజులుగా నిర్వహిస్తున్నామని, నేటితో ముగిశాయని రవీంద్రభారతి ప్రిన్సిపాల్ ఘోరక్ చంద్ పల్క శనివారం అన్నారు. రవీంద్ర భారతి విద్యా సంస్థలు విద్యార్థుల్లో దాగి ఉన్న శృసృజనాత్మకతను వెలికితీయాలనే ఉద్దేశంతో సైన్స్ సంబరాలు ఏర్పాటు చేయడం జరిగిందని, విద్యార్థులలోని సృజనాత్మక శక్తిని వాక్పటిమను పరిశోధనలోని పదార్థాలు, సాధ నాలు నమూనాల నేపథ్యంలో ద్వారా విజ్ఞాన శాస్త్ర పరిధిని అధ్యయనం చేయడానికి అవకాశం ఉంటుం దని తెలిపారు. విద్యార్థి దశ నుండే విజ్ఞాన శాస్త్రంలోని మెలకువలను తెలుసుకోవాలని, ప్రతీ విద్యార్థి ఒక గమ్యాన్ని నిర్దేశించుకొని విజయ పరంపర కొనసా గించాలని, విద్యార్థి దశ నుండే వారికి అవగాహన కల్పిస్తే ప్రభుత్వ కొలువులతోపాటు, ఉన్నత స్థానంలో నిలిచి కీర్తిప్రతిష్టతలు సాధిస్తారన్నారు. అనంతరం సైన్స్ ఎక్స్పోలో మొదటి, ద్వితీయ, తృతీయ స్థానంలో నిలిచిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందించి విద్యార్థులు తయారు చేసిన నమూనాలను ఆసక్తిగా తిలకించి వాటి ఉపయోగాలను క్షుణ్ణంగా తెలుసుకున్నారు. కార్యక్ర మంలో డీన్ నాగరాజు, డిఐ రమేష్, ఉపాధ్యాయులు, విద్యా ర్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.






## నక్సలిజం సజీవమే

**-వీక్షణము ఎడిటర్ ఎన్.వేణుగోపాల్**



**పలాస, మార్చి 1(వార్త):** విప్లవకారులను హత్య చేసింత మాత్రాన్న విప్లవ ఉద్యమాలు ఆగ వని వీక్షణ పత్రిక ఎడిటర్ ఎన్ వేణుగోపాల్ అన్నారు. పలాస మండలం బొడ్డపాడుగ్రామంలో బొడ్డపాడు యువజన సంఘము 71 వ వార్షికోత్స వము సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లా డారు. కేంద్ర హోమ్ మంత్రి అమిత్ షా వచ్చే ఏడాది మార్చి నెలలో మావోయిజాన్ని, మావో యిస్టు పార్టీ లేని భారతదేశంలో తయారు చేస్తా మని ప్రకటించడంపై ఆయన తీవ్రంగా మండిపడ్డారు. కార్యక్రమంలో మానవ హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కే వి జగన్నాథం, డి టిఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షులు కోత ధర్మారావు, పీకే ఎస్ జిల్లా అధ్యక్షులు మద్దెల ధర్మారావు, ఏబీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తామాడ త్రిలోచన రావు,టెక్కలి డివిజన్ రైతాంగ కమిటీ మాజీ అధ్యక్షులు దాసరి శ్రీరాములు, రైతాంగ సమస్యల సాధన కమిటీ అధ్యక్షులు మామిడి మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546